

www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 187 | మంగళవారం | 17 డిసెంబర్ , 2024





# 2 బీఏసీ లేకుండానే బిల్లులు

- ఎన్ని రోజులు సభ నడుపుతారో స్పష్టతలేదు
- సభ కనీసం 15 రోజులు నడపాలి
- ప్రభుత్వ ఆంక్షలపై హరీశ్‌రావు మండిపాటు
- శాసనసభలో విపక్ష సభ్యుల నినాదాలు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శన
- సభా మర్యాదలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు
- ఆవేదన వ్యక్తం చేసిన శాసనసభ స్పీకర్
- సభా సంప్రదాయాలను పట్టించుకోవట్లేదు
- బీఆర్ఎస్ తీరును ఖండించిన మంత్రులు
- ఎలాంటి నిర్ణయాలు లేకుండానే ముగిసిన బీఏసీ సమావేశం
- 21వరకు అసెంబ్లీ సమావేశాలు
- బిఎసిలో శాసనసభ స్పీకర్ నిర్ణయం
- బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్

అసెంబ్లీ సమావేశాలు మరో 5 రోజుల పాటు జరుగనున్నాయి. ఈ మేరకు బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశమైంది. అయితే బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశారు. సభా పని దినాలు, సబ్జెక్ట్‌పై క్లారిటీ ఇవ్వనందుకు వాకౌట్ చేసిన బీఆర్ఎస్ ప్రకటించింది. మరోవైపు టీ షర్ట్స్‌పై బీఏసీలో వాడి వేడి చర్చ జరిగింది. టీ షర్ట్స్ వేసుకుని వస్తే తప్పేంటని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ టీ షర్ట్స్ వేసుకుని వెళ్లడం లేదా అని సమావేశంలో హరీష్ రావు ప్రశ్నించారు.

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** హరీశ్ రావు ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. బీఏసీ లేకుండానే 2 బిల్లులు ప్రవేశపెట్టి, చర్చ పెట్టడం సంప్రదాయ విరుద్ధమని, కనీసం బీఏసీ మీటింగ్‌లో ఎన్ని రోజులు సభ నడుపుతారో కూడా స్పష్టంగా చెప్పడం లేదన్నారు. సభ కనీసం 15 రోజులు నడపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం 3, 4 రోజులు సభ నడుపుతామని చెబుతోందని ఇలా అయితే ప్రజా సమస్యలపై చర్చ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రభుత్వ ఆంక్షలపై కూడా హరీశ్ రావు మండి పడ్డారు. తొలిరోజు టీ షర్టులతో వస్తే ఎందుకు ఆపారని మీటింగ్?లో నిలదీశామని హరీశ్‌రావు తెలిపారు. టీషర్టుతో పార్లమెంటుకు రాహుల్ వెళ్లట్లేదా అని ప్రశ్నించారు.

మిగతా 2 లో

## నేడు లోక్‌సభ ముందుకు జమిలి బిల్లు

### సభలో ప్రవేశ పెట్టనున్న న్యాయశాఖ మంత్రి



- అనంతరం జెపిసికి పంపేందుకు సిద్ధం

**న్యూఢిల్లీ:** దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఒకే దేశం-ఒకే ఎన్నిక లక్ష్యంతో దేశమంతా ఒకేసారి నిర్వహించే జమిలి ఎన్నికలపై లోక్‌సభలో బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలిసింది. మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లులను ప్రవేశ పెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి.

మిగతా 2 లో



## మార్చి 5నుంచి ఇంటర్ పరీక్షలు

- ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్
- తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

02

## కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులు

- 31 లక్షల మందికి ప్రయోజనం
- శాసన మండలిలో మంత్రి ఉత్తమ్



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** ప్రభుత్వ అంచనా ప్రకారం.. కొత్తగా పది లక్షల కొత్త రేషన్ కార్డుల మంజూరు ఉండవచ్చని.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. తద్వారా 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కొత్త రేషన్ కార్డుల మంజూరికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను కుడా ఆధారం చేసుకుంటామన్నారు. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీతో.. ప్రభుత్వంపై అదనంగా రూ.956 కోట్ల భారం పడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులను జారీ చెయ్యబోతున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో అదనపు పేర్ల నమోదుకు.. మీ సేవ కేంద్రం ద్వారా గడిచిన పదేళ్లుగా

మిగతా 2 లో

## హైదరాబాద్‌లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- గతంల ఎన్నడూ లేనంతగా 7.1 డిగ్రీలుగా నమోదు

02





03

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు

లోక్‌సభలో ఆందోళన వ్యక్తంచేసిన ప్రియాంక
తక్షణ చర్యలకు ప్రభుత్వానికి డిమాండ్

## నేడు ఎయిమ్స్ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ముర్ము

02





### జై శ్రీరామ్ నినాదాలు చేయడం
## ఎలా నేరపూరిత చర్య?

- మసీదు లోపల నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తించారు?
- ఫిర్యాదుదారున్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

02


ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# బీఏసీ లేకుండానే 2 బిల్లులు

మొదటి పేజీ తరువాయి

లగచర్ల రైతులకు బేడీలపై చర్చించాలంటే స్పందించట్లేదన్నారు. సభలో పర్యాటకం కంటే లగచర్ల రైతులపై చర్చే ముఖ్యమని చెప్పామన్నారు. ప్రతి రోజూ జీరో అవర్ ఉండాలని కోరినట్లు హరీశ్‌రావు తెలిపారు. అయితే ఈ ఆరోపణలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖండించారు. అసెంబ్లీ నిబంధనల మేరకే బీఏసీ జరిగిందని స్పష్టం చేశారు. బీఏసీలో బీఆర్ఎస్ వ్యవహారించిన తీరు సరిగ్గాలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అసెంబ్లీ ఎన్ని రోజులు నడుపాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారని, ఈ విషయం పదేళ్లు పాలించిన వారికి ఇది తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు చెప్పినట్లు సభ పనిదినాలు ఉండాలంటే ఎలా అని ప్రశ్నించారు. తాను ఎల్‌వోపీగా ఉన్నప్పుడు గత ప్రభుత్వం ఇలాగే చేసిందన్న విషయం తనకు తెలియదా అన్నారు. ఇప్పుడు కూడా సభ ఎన్ని రోజులు జరపాలో స్పీకరే నిర్ణయిస్తారని తేల్చి చెప్పారు. శాసనసభలో విపక్ష సభ్యుల నినాదాల మధ్య సభ రేపటికి వాయిదా పడింది. సభా మర్యాదలు దెబ్బతీసేలా సభ్యులు వ్యవహరిస్తున్నారని స్పీకర్? ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశమైంది. అయితే బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశారు. సభా పని దినాలు, సబ్జెక్ట్‌పై క్లారిటీ ఇవ్వనందుకు వాకౌట్ చేసిన బీఆర్ఎస్ ప్రకటించింది. మరోవైపు టీ షర్ట్స్‌పై బీఏసీలో వాడి వేడి చర్చ జరిగింది. టీ షర్ట్స్ వేసుకుని వస్తే తప్పేంటని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ టీ షర్ట్స్ వేసుకుని వెళ్లడం లేదా అని సమావేశంలో హరీష్ రావు ప్రశ్నించారు. బీఏసీ సమావేశంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. గంట సేపు సమావేశం జరిగినా సభ పనిదినాలపై స్పష్టత ఇవ్వడం లేదని ఆయన అన్నారు. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేసినట్ల మాజీ మంత్రి తెలిపారు. 'మేము 15రోజులు సభ పెట్టాలని అడిగాము. సభను నాలుగైదు రోజులే నడిపే మూడ్‌లో ఉన్నారు. మమ్మల్ని అడ్వయిజ్



మాత్రమే ఇవ్వాలని సీఎం అన్నారు. కేవలం సలహా మాత్రమే ఇవ్వాలని అంటున్నారు. ఇదే విషయంపై ఎంఐఎం కూడా వాక్ ఔట్ చేసింది. ప్రోటోకాల్ పాటించడం లేదని స్పీకర్‌కు చెప్పాం. బీఏసీ పెట్టకుండానే బిల్స్ ఎలా పెడతారు అని అడిగాము. పెళ్ళిళ్లు ఉన్నాయని సభ పెట్టకపోవడం ఏంటని అడిగాము. కనీసం 15 రోజులు ఈసారి సభ నడపాలని బీఆర్ఎస్ నుంచి అడిగాం. ప్రతిరోజూ జీరో అవర్ పెట్టాలని అడిగాం. టీషర్ట్‌లతో ఎందుకు రానియడం లేదని గట్టిగా అడిగాము. మీ నాయకుడు రాహుల్ గాంధీ టీ షర్ట్‌లతో వెళ్ళాడు కదా అని గుర్తు చేశాము. బీఏసీ అంటే బిస్కెట్ అండ్ చాయ్ లాగా చేశారు' అంటూ హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు. బీఏసీ అంటే బిస్కెట్ అండ్ చాయ్ లాగా చేశారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. స్పీకర్ ఛాంబర్ లో బీఏసీ భేటీ జరిగింది. ఈ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం హరీష్ రావు, ఎంఐఎం సభ్యులు హాజరయ్యారు. కాగా.. సభలో మీరు కేవలం సలహా మాత్రమే ఇవ్వాలని అనడంతో బీఆర్ఎస్ వాకౌట్ చేసిందన్నారు. ఇదే విషయంపై ఎంఐఎం కూడా వాక్ ఔట్ చేసిందని హరీష్ రావు తెలిపారు. సభ పని దినాలు అజెండా పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని నిరసన తెలిపామన్నారు. సభ గంటన్నర పాటు కొనసాగిందన్నారు. సభలో మంత్రి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్ఎస్? సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో సభ్యుల వద్ద ప్లకార్డులను తీసుకురావాలని మార్షల్స్?కు స్పీకర్? ఆదేశించారు. ప్లకార్డులను మార్షల్స్?కు ఇస్తే మాట్లాడే అవకాశమిస్తామని స్పీకర్? సభ్యులకు సూచించారు. విపక్ష సభ్యుల నినాదాల మధ్య సభను రేపటికి వాయిదా వేశారు. శాసనసభలో బీఆర్ఎస్? నేతల తీరును ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్? బాబులు ఖండించారు. పర్యాటక అంశంపై మంత్రి మాట్లాడుతుంటే అడ్డుకున్నారని మండిపడ్డారు. సభా సంప్రదాయాలను విపక్షసభ్యులు పట్టించుకోవట్లేదని ఆక్షేపించారు. సభా మర్యాదకు భంగం కలిగించడం సరికాదని భట్టి విక్రమార్క హితవుపలికారు. సభాపతిపై విపక్ష సభ్యులకు గౌరవం ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు శాసనసభలో బీఆర్ఎస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించడాన్ని మంత్రి శ్రీధర్?బాబు తప్పుపట్టారు. సభా సంప్రదాయాలను విపక్షాలు గౌరవించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్? ఆదేశాలను సభ్యులు పక్కనపెట్టడం సరికాదన్నారు. విపక్షాలు లేవనెత్తిన ప్రతి అంశంలో ప్రభుత్వం జవాబిస్తుందన్నారు. బీఏసీ భేటీలో విపక్షాలు అభిప్రాయాలు తీసుకున్నారని తెలిపారు. విపక్షసభ్యులు సభా సమయం వృథా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మరో ఐదు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ మేరకు బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 21 వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి.

# జై శ్రీరామ్ నినాదాలు చేయడం ఎలా నేరపూరిత చర్య?

**న్యూఢిల్లీ:** జై శ్రీరామ్ నినాదాలు చేయడం నేరపూరిత చర్య ఎలా అవుతుందని సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. మసీదు లోపల నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులపై విచారణను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌ను సమీక్షిస్తూ న్యాయమూర్తులు పంకజ్ మిథాల్, సందీప్ మెహతా ఈ అంశాన్ని లేవనెత్తారు. మసీదు లోపల 'జై శ్రీరామ్' నినాదాలు చేసిన ఇద్దరు వ్యక్తులపై విచారణను రద్దు చేసిన కర్ణాటక హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన భారత అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. హైదర్ అలీ సిఎం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఒక నిర్దిష్ట మతపరమైన పదబంధాన్ని లేదా పేరును అరుస్తుంటే అది ఎలా నేరం అని బెంచ్ ప్రశ్నించింది. మసీదు లోపలికి వచ్చి నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తించారని సుప్రీంకోర్టు ఫిర్యాదుదారుని ప్రశ్నించింది. విచారణ సందర్భంగా, పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఈ ప్రతివాదులను ఎలా గుర్తిస్తారు? అవన్నీ సీసీటీవీలో రికార్డయ్యాయని అంటున్నారు. లోపలికి వచ్చిన వ్యక్తులను ఎవరు గుర్తించారని బెంచ్ ప్రశ్నించింది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 లేదా సెక్షన్ 447లోని నిబంధనలను అభియోగాలు తాకడం లేదని హైకోర్టు గుర్తించిందని ధర్మాసనం పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 క్రిమినల్ బెదిరింపులకు సంబంధించిందని, అయితే సెక్షన్ 447 నేరపూరిత అతిక్రమణకు శిక్షను సూచిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫిర్యాదును ప్రస్తావిస్తూ, ఎఫ్ఐఆర్ నేరాల ఎన్‌సైక్లోపీడియా కాదని కామత్ అన్నారు. మసీదులోకి ప్రవేశించిన అసలు వ్యక్తులను మీరు గుర్తించగలిగారా? దీనిపై రాష్ట్ర పోలీసులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని కామత్ అన్నారు. దీనిపై ధర్మాసనం పిటిషన్ కాపీని రాష్ట్రానికి ఇవ్వాలని పిటిషనర్‌ను కోరగా, కేసు తదుపరి విచారణను 2025 జనవరికి వాయిదా వేసింది. అంతకుముందు సెప్టెంబర్ 13న, ఈ కేసులో ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. ఎవరైనా 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేస్తే ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను ఎలా దెబ్బతీస్తారన్నది అర్థం కావడం లేదని కర్ణాటక హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రజా విఘాతం లేదా ఎలాంటి చీలిక ఏర్పడినట్లు ఎలాంటి ఆరోపణలు లేవని వ్యాఖ్యానించింది. ఐపిసి సెక్షన్ 506 ప్రకారం నేరపూరిత బెదిరింపు నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఎవరో కూడా ఫిర్యాదుదారు చూపలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మసీదులోకి ప్రవేశించి మతపరమైన నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ప్రొసీడింగ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సంఘటన 2023 సెప్టెంబర్ 24న జరిగింది. పుత్తూరు సర్కిల్‌లోని కడప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మసీదులోకి ప్రవేశించి 'జై శ్రీరామ్' నినాదాలు చేయడంతో బెదిరింపులకు దిగారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఎలాంటి ఆరోపణ చేసిన నేరాలకు సంబంధించిన ఆధారాలు లేకుండా, పిటిషనర్‌లపై విచారణ కొనసాగించడం చట్టపరమైన దుర్వినియోగం అవుతుందని, న్యాయపరమైన అనుచితానికి దారి తీస్తుందని హైకోర్టు నిర్ధారించింది.

# కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

వచ్చిన 18 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం నియమించారని చెప్పారు. తనను ఛైర్మన్‌గా, సహచర మంత్రులు దామోదరం రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సభ్యులుగా ఉన్నారని వెల్లడించారు. ఈ ఉప సంఘం పలుమార్లు సమావేశమై.. సిఫారసులను కేబినెట్ ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారుతెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో సుప్రీంకోర్టుకు సక్సేనా కమిటీ సమర్పించిన సిఫారసులను పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తమ్ చెప్పారు. అంతే గాకుండా రాష్ట్రంలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల నుండి సేకరించిన సూచనలను కూడా మంత్రివర్గ ఉప సంఘం పరిగణనలోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వీటన్నింటినీ అధ్యయనం చేసిన ఉపసంఘం.. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి అర్హతా ప్రమాణాలు నిర్ణయిస్తూ చేసిన సిఫారసులు.. కేబినెట్ ముందుంచినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీ ప్రక్రియను చేబడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలతో పాటు తాండాలలో కుడా చౌక ధరల దుకాణాల ఏర్పాటు చేస్తామన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలెవ్వరు వినియోగించక పోవడంతో.. దారి మళ్లుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకే తెల్ల రేషన్ కార్డు దారులందరికి ఇకపై సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతంలో.. 91 లక్షల 68 వేల 231 రేషన్ కార్డులు ఉండేవన్నారు. మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.38 కోట్లని ఆయన సభకు వివరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఇక్కడి నుండి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారని.. 2 లక్షల 46 వేల 324 రేషన్ కార్డులు రద్దు అయినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణా ఏర్పడ్డాక 2.7 కోట్ల లబ్ధిదారులకు గాను మొత్తం 89 లక్షల 21 వేల 907 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు.

## నేడు లోక్‌సభ ముందుకు

# జమిలి బిల్లు

మొదటి పేజీ తరువాయి

కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. వాస్తవానికి రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల సవరణ బిల్లును సోమవారం సభలో ప్రవేశ పెట్టనున్నట్లు ముందుగా వార్తలు వచ్చాయి. అయితే తాజాగా రివైజ్ చేసిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో వీటిని తొలగించారు. లోక్‌సభ కార్యదర్శి విడుదల చేసిన రివైజ్డ్ జాబితాలో సోమవారం ఈ రెండు బిల్లులకు సంబంధించిన అజెండాను పెట్టలేదు. దీంతో ఈ బిల్లులు నేడు సభ ముందుకు రాలేదు. మంగళవారం ఈ బిల్లులు లోక్‌షభ ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. ఈ క్రమంలో మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఎట్టకేలకు పార్లమెంట్ ముందుకు ఈ బిల్లు రానుంది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లును కేంద్రం మంగళవారం లోక్‌సభ లో ప్రవేశపెట్టనుంది. జమిలి ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలు నెలకొన్నవేళ దీనిపై విస్తృత సంప్రదింపుల కోసం బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ (ఏఖఅ)కి పంపించాలని స్పీకర్ ఓం బిర్లాను కేంద్రమంత్రి అభ్యర్థించనున్నారు. అనంతరం దీనిపై ప్యానెల్ కమిటీ ఏర్పాటుకు సభ్యులను ప్రతిపాదించాలని సభాపతి పార్టీలను కోరనున్నారు. సాయంత్రానికి కమిటీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉంది. పార్లమెంట్‌లో పార్టీల సంఖ్యాబలం ఆధారంగా కమిటీలో వారికి చోటు దక్కుతుంది. అంటే అతిపెద్ద పార్టీ అయిన భాజపా నుంచి ఒక ఎంపీ కమిటీ ఛైర్మన్‌గా ఉంటారు. తొలుత ఈ ప్రతిపాదిత కమిటీకి 90 రోజుల సమయం కేటాయిస్తారు. అవసరాన్ని బట్టి ఆ తర్వాత దాన్ని పొడిగిస్తారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో జమిలి ప్రణాళికకు ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టి.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన రెండు బిల్లులను కేంద్ర కేబినెట్ ఈనెల 12న ఆమోదించింది. వీటిని ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే లోక్‌సభ ముందుకుతీసుకురావాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉంది. ప్రస్తుత శీతాకాల సమావేశాలు ఈనెల 20తో ముగియనున్నాయి.





# హైదరాబాద్‌లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**ప్రజానావ, సోమాజిగూడ:** హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. గత ఆరేండ్లలో ఎన్నడూ లేనంతంగా కనిష్టానికి పడిపోయాయి. హెచ్‌సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, బీహెచ్‌ఈఎల్‌లో 7.4, రాజేంద్రనగర్‌లో 8.2, గచ్చిబౌలి 9.3, వెస్ట్ మారేడుపల్లి 9.9, కుత్బుల్లాపూర్, మచ్చబొల్లారం 10.2, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, షాపూర్‌నగర్ 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరెడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, చాంద్రాయణగుట్ట 13, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్ 13.3, ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శనగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లి 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీలు రికార్డయ్యాయి. నిర్మల్ జిల్లా తాంద్రలో 6.3, ఆదిలాబాద్ జిల్లా పోచర 6.4, జైనాథ్ 6.5, అర్లి (టీ) 6.6, చాప్రాల్ 6.6, సంగారెడ్డి జిల్లా సత్వార్ 6.6, వికారాబాద్‌లోని బంట్వారం 6.7, సంగారెడ్డిలోని న్యాల్కల్‌లో 6.7, ఎలిమినేడు, రాచలూరు (రంగారెడ్డి) 6.7, సిర్పూర్ యూ (ఆసిఫాబాద్) 6.7, చందనపల్లి (రంగారెడ్డి) 6.7, కోహిర్ (సంగారెడ్డి) 6.7, మర్పల్లి (వికారాబాద్) 6.8, వికారాబాద్ జిల్లాలోని నగరం (టీ), మన్నెగూడలో 6.8, నల్లవెల్లి (సంగారెడ్డి) 6.8, పోతరరెడ్డిపేట (సిద్దిపేట) 6.9, జహీరాబాద్ (సంగారెడ్డి) 6.9, మెనూర్ (కామారెడ్డి) 6.9, రాఘవపేట (జగిత్యాల) 7.3, కెరమెరి (ఆసిఫాబాద్) 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు.

# నేడు ఎయిమ్స్ స్నాతకోత్సవం

**ప్రజానావ, విజయవాడ:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఏపీలో పర్యటించనున్నారు. ఉదయం రాష్ట్రానికి రానున్న రాష్ట్రపతి అదేరోజు సాయంత్రం హైదరాబాద్‌కు బయలుదేరతారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, ఉదయం 8.35 గంటలకు రాష్ట్రపతి ముర్ము ఢిల్లీ నుంచి విజయవాడకు బయలు దేరతారు. ఉదయం 11.30 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం 12.05 గంటలకు మంగళగిరి ఎయిమ్స్‌లో స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరువుతారు. ఇందులో భాగంగా 49 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు పట్టాలు, నలుగురు విద్యార్థులకు బంగారు పతకాల బహూకరిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు రాష్ట్ర గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం రాష్ట్రపతి విజయవాడ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణమవుతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎయిమ్స్ మంగళగిరి పరిసరాల చుట్టూ పోలీసు పహారా ఏర్పాటు చేశారు.



# మార్చి 5నుంచి ఇంటర్ పరీక్షలు

**ప్రజానావ, సోమాజిగూడ:** తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 5 నుంచి 25 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. జనవరి 29న ఎథిక్స్ అండ్ హ్యూమస్ వ్యాల్యూస్ పరీక్ష, 30న పర్యావరణ పరీక్ష జరగనుంది. ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షను ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 1న, సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1న నిర్వహించనున్నారు. రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు ఒకేసారి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇంటర్ రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 3, 2025 నుంచి ఫిబ్రవరి 22, 2025 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్ టేబుల్ విడుదలైంది. మార్చి 1నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా ప్రకటించారు. ఇంటర్మీడియట్ రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయి.

## తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఇదే..

### ఫస్ట్ ఇయర్ పరీక్షల తేదీలు ఇవే

| | |
|---|---|
| 05-03-2025 - | పార్ట్-2 సెకండ్ ల్యాంగ్వేజ్ |
| 07-03-2025 - | పార్ట్-1 ఇంగ్లీష్ పేపర్ |
| 11-03-2025 - | మాథ్స్ పేపర్ 1ఏ, బోటని పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1 |
| 13-03-2025 - | మ్యాథ్స్ పేపర్ 1బీ, జూలాజి పేపర్ -1, హిస్టరీ పేపర్-1 |
| 17-03-2025 - | ఫిజిక్స్ , ఎకనామిక్స్ |
| 19-03-2025 - | కెమిస్ట్రీ , కామర్స్ |

### సెకెండ్ ఇయర్ పరీక్షల తేదీలు ఇవే

| | |
|---|---|
| 06-03-2025 - | పార్ట్-2 సెకండ్ ల్యాంగ్వేజ్ |
| 10- 03-2025 - | పార్ట్-1 ఇంగ్లీష్ |
| 12-03-2025 - | మాథ్స్-2ఏ, బోటని, పొలిటికల్ సైన్స్ |
| 15-03-2025 - | మ్యాథ్స్-2బీ, జూలాజి, హిస్టరీ |
| 18-03-2025 - | ఫిజిక్స్, ఎకనామిక్స్ |
| 20-03-2025 - | కెమిస్ట్రీ , కామర్స్ |

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

- రుణాలపై తప్పుడు నివేదిక సమర్పించిన కాంగ్రెస్
- రూ.3.89 లక్షల కోట్లు ఉందని ఆర్‌బిఐ చెబితే రూ.7 లక్షల కోట్లు చూపి తప్పుదోవ
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్




**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌పై తప్పుడు నివేదికలు వెల్లడించిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆర్థిక మంత్రి ప్రసంగం పూర్తిగా అవాస్తవమని "హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్" పేరుతో ఆర్బీఐ విడుదల చేసిన నివేదికలో నిరూపితమైందని కేటీఆర్ అన్నారు. 2014-15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ.72 వేల 658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ. 3,89, 673 కోట్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ అప్పులు కేవలం రూ.3.89 లక్షల కోట్లు అని ఆర్బీఐ నివేదికలో స్పష్టం చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.7లక్షల కోట్లు అంటూ తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులపై ఆర్థిక మంత్రి ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారమిచ్చి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించారని అన్నారు. అందుకే తెలంగాణ శాసనసభ కార్య విధాన మరియు కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 168 (1) నిబంధన ప్రకారం బీఆర్ఎస్ శాసనసభా పక్షం తరపున ఆర్థిక మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న అంశంలోనూ సభా హక్కుల నోటీసులు ఇచ్చామని తెలిపారు. లగచర్ల వంటి బాధాకరమైన సంఘటన జరిగినప్పుడు, టూరిజంపైన అసెంబ్లీలో చర్చ పెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యతలకు అద్దం పడుతుందని కేటీఆర్ విమర్శించారు. లగచర్ల అంశంపై శాసనసభలో చర్చించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. అసలైన అప్పులతో రాష్ట్ర ప్రభుత్వం సవరణ స్టేట్‌మెంట్ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సవరణ ఇవ్వని పక్షంలో సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కోరారు. గతంలో తానే స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిపై ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌ను అప్పటి స్పీకర్ మనోహర్ అంగీకరించారని గుర్తుచేశారు. దానిపై అప్పుడు సభలో చర్చ జరిగిందని పేర్కొన్నారు. గతంలో ఉన్న పద్ధతులు, సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రివిలేజ్ మోషన్ కు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశామని తెలిపారు. గతంలో ఉన్నటువంటి సాంప్రదాయాలను పరిగణలోకి తీసుకుని సభా హక్కుల ఉల్లంఘన తీర్మానానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ శాసనసభలో అనుమతి ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలు అప్పులపై బయట కూడా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 7 లక్షల కోట్ల అప్పు అంటూ లేని అప్పు గురించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్లు చెబుతున్న అప్పుల లెక్కలు తప్పు కాబట్టి.. ఈ ప్రభుత్వం కడుతున్నామని చెబుతున్న నెలకు 6వేల 500 కోట్ల వడ్డీ లెక్కలు కూడా తప్పే అని స్పష్టం చేశారు. ఏడాదికి కేవలం రూ.22 వేల కోట్ల వడ్డీ మాత్రమే కడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉండగా కేవలం టూరిజంపైనే రాష్ట్ర ప్రభుత్వం చర్చకు స్వీకరించడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం బాగా నడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి 100కి పైగా చేసిన పర్యటనలతో ఢిల్లీ టూరిజం బాగా పెరిగిందని విమర్శించారు. మరోవైపు 40 మంది లగచర్ల రైతులను జైలులో పెట్టడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న సోషల్ మీడియా కార్యకర్తల నుంచి మొదలుకొని పార్టీ నాయకులను జైల్లో పెడుతున్న జైలు టూరిజం.. బెయిల్ వచ్చిన తర్వాత కూడా నటులను జైలులో ఉంచుతున్న జైలు టూరిజం.. ప్రభుత్వ పథకాలపై మాట్లాడుతుంటే జైలుకు పంపిస్తామని ముఖ్యమంత్రి చేస్తున్న జైలు టూరిజం.. ఈ విధంగా తెలంగాణలో జైలు టూరిజం బాగా నడుస్తుందని అన్నారు. సర్పంచ్‌ల సమస్యలపై కూడా శాసన సభలో చర్చకు లేవనెత్తామని కేటీఆర్ తెలిపారు. సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన రూ.600 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశామన్నారు. గత నెలలో బడా కాంట్రాక్టర్లకు ఇచ్చిన రూ.1200 కోట్ల నిధుల్లో సగం ఇస్తే.. సర్పంచ్‌ల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని స్పీకర్ కు కూడా విజ్ఞప్తి చేశామని నచెప్పారు. లగచర్ల అంశంపై కూడా సభలో చర్చించాలని స్పీకర్‌ను కోరినట్లు కేటీఆర్ తెలిపారు. రైతులను అక్రమంగా జైలులో ఉంచిన కాంగ్రెస్ సర్కార్ తీరుపై రాష్ట్ర ప్రజలు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని శాసన సభలో తెలియజేయాలని డిమాండ్ చేశారు.

## జాబ్ క్యాలెండర్ ప్రకారమే నోటిఫికేషన్లు

### ఉద్యోగాల ఖాళీల అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణలో ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు జాబ్ కేలండర్ ఆధారంగా ఉంటాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగాల ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ప్రశ్నపత్రాల లీక్, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేపడుతున్నామని తెలిపారు. శాసన మండలిలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల భర్తీ కోసమే జాబ్ క్యాలెండర్ ప్రకటించామని దశలవారీగా భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపడతామన్నారు. కాగా, 'అదిగో జాబ్ క్యాలెండర్.. ఇదిగో జాబ్ క్యాలెండర్' అంటూ నిరుద్యోగులను ఊరించిన రేవంత్‌రెడ్డి సర్కారు, ఈ ఏడాది ఆగస్టు 3న గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఖాళీల వివరాల్లేని.. నోటిఫికేషన్, పరీక్షల తేదీల్లేని జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉసూరుమనిపించింది. జాబ్ క్యాలెండర్‌లో మొత్తం 20 రకాల షెడ్యూళ్లను ప్రకటించగా వీటిలో అర్హత పరీక్ష అయిన టెట్ రెండుసార్లు ఉన్నది. మిగతా 18లో గ్రూప్-1, 2, 3 నోటిఫికేషన్లు గతంలో జారీ అయినవే కావడం గమనార్హం. పరీక్షలు మాత్రమే నిర్వహించాల్సి ఉన్న వీటిని కూడా కొత్త జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించి కాంగ్రెస్ సర్కారు తన ఖాతాలో వేసుకున్నది. యూపీఎస్సీ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తుంది. నోటిఫికేషన్ తేదీ, దరఖాస్తు గడువు, రాత పరీక్ష తేదీ లాంటి పూర్తి వివరాలు అందులో పొందుపరుస్తుంది. కానీ రేవంత్ సర్కారు ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో ఇవేవీ లేవు. కేవలం ఫలానా నెలలో నోటిఫికేషన్ ఇస్తాం.. ఫలానా నెలలో పరీక్ష నిర్వహిస్తామన్న వివరాలు మాత్రమే ప్రకటించారు.

## మోహన్‌బాబు వివాదంలో మూడు కేసులు

### దర్యాప్తు కొనసాగుతోందన్న సిపి సుధీర్ బాబు

**ప్రజానావ, సోమాజిగూడ:** మోహన్ బాబు మంచు మనోజ్ వివాదంలో ఇప్పటికే మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని..దర్యాప్తు చేస్తున్నామని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. మోహన్ బాబు అరెస్ట్ విషయంలో ఎక్కడ ఆలస్యం లేదని స్పష్టం చేశారు. ఆయన వద్ద మెడికల్ రిపోర్ట్ తీసుకోవాలని చెప్పారు. మోహన్ బాబుకు నోటీస్ ఇచ్చామని.. ఈ నెల 24 వ తేదీ వరకు సమయం అడిగారని తెలిపారు. 24వ తేదీ వరకు తెలంగాణ హైకోర్టు కూడా మోహన్ బాబుకు మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. 24వ తేదీ లోపు ఎగ్జామిన్ చేయొచ్చా లేదా అనే విషయం గురించి కోర్టును అడుగుతామని అన్నారు. రాచకొండ పరిధిలో మోహన్ బాబుకు ఎలాంటి గన్ లైసెన్స్ లేవని తేల్చిచెప్పారు. మోహన్ బాబు వద్ద రెండు గన్స్ ఉన్నాయన్నారు. డబుల్ బ్యారెల్ ఒకటి .స్పానిష్ మేడ్ రివాల్వర్ ఒకటి ఉందని వివరించారు. మోహన్ బాబుకు మరోసారి నోటీస్ ఇస్తామని తెలిపారు. మరోవైపు నోటీసులకు స్పందించకపోతే అరెస్ట్ చేస్తామని రాచకొండ సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ ఖేల్ ఖతం అని తెలుసు

### అందుకే కెసిఆర్ సభకు రావడం లేదు
### మంత్రి కోమటిరెడ్డి సెటైర్లు



**ప్రజానావ, హైదరాబాద్:** ఐదుగురు ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క రోజూ సభకు వచ్చారని.. 38 మంది ఉన్న బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ ఎందుకు రావడం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి కంటే ఎక్కువ విలువ ప్రతిపక్ష నాయకుడికి ఉంటుందన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ఖతం అవుతుంది అని కేసీఆర్ ముందే తెలుసుకొని సభకు రావడం లేదన్నారు. అసెంబ్లీ లాబీల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం కేసీఆర్‌కు లేదని.. అందుకే అసెంబ్లీ వస్తలేరు అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. కొడుకు , అల్లుడు , బిడ్డలను తాము పట్టించుకోమన్నారు. డీలిమిటేషన్‌లో 34 అసెంబ్లీ సీట్లు, 7 ఎంపీ సీట్లు పెరుగుతాయన్నారు. జమిలి డ్రాఫ్ట్ రెడీ అయిందన్నారు. మా సీఎం , మంత్రులు పబ్లిక్‌కి అందుబాటులో ఉంటున్నాము ప్రతిపక్ష హోదా లేకున్నా ఖర్గే, అదిర్ రంజన్ చౌదరి పార్లమెంట్‌కి వెళ్లారన్నారు. బ్జడెట్ సమావేశాల వరకు కొత్త మంత్రివర్గం రెడీ అవుతుందని ఆయన వెల్లడించారు.కాంగ్రెస్‌లో మంత్రి వర్గ విస్తరణలో ఎవరికి పదవులు అనేది ఎవరు చెప్పలేరన్నారు. ఈ విషయం పార్టీ అధిష్ఠానం, సీఎందే తుది నిర్ణయమన్నారు. పాలమూరు నుంచి శ్రీహరికి కచ్చితంగా మంత్రి పదవి.. ఇది మాత్రం చెప్పగలనన్నారు. నల్గొండలో 2018లో భూపాల్ రెడ్డిని వికలాంగుడు అనే సానుభూతితో గెలిపించారంటూ మంత్రి విమర్శించారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ ఓడారు.. నేనెంత అంటూ వ్యాఖ్యానించారు. కల్వకుర్తిలో ఎన్టీఆర్ మీద చిత్త రంజన్ ఇంట్లో నుంచి గెలిచారన్నారు. తన మీద గెలిచేందుకు బూర నర్సయ్య రూ.80 కోట్లు ఖర్చు పెట్టారని.. అయినా తానే గెలిచానన్నారు. ప్రతిపక్ష ఎంపీగా ఎన్నో రోడ్ ప్రాజెక్టులు తీసుకొచ్చామన్నారు. గడ్కరీ నిన్న సీఎంకు చెబుతూ.. వెంకన్న నాకు చోటా బాయ్ అన్నారన్నారు.

## కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో ప్రివిలేజ్


### అప్పులపై తప్పుడ నివేదిక వెల్లడించారని ఆరోపణ

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాసనసభలో ప్రివిలేజ్ మోషన్ పెట్టాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. రాష్ట్ర అప్పులపై శాసన సభను, ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. తెలంగాణ అప్పులు కేవలం రూ.3.89 లక్షల కోట్లు అని ఆర్‌బీఐ తన నివేదికలో స్పష్టం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.7లక్షల కోట్ల అప్పులు ఉన్నాయంటూ తప్పుదోవ పట్టిస్తున్నాయని చెప్పారు. అందుకే సభాహక్కుల నోటీసు ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అప్పులపై ఆర్థిక మంత్రి ప్రసంగం పూర్తిగా అవాస్తవమని ఇటీవల "హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్" పేరిట రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నివేదిక నిరూపించిందని స్పీకర్ దృష్టికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీసుకెళ్లారు. 2014-15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ.72 వేల 658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ. 3,89, 673 కోట్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించిందని తెలిపారు. రాష్ట్ర అప్పులపై ఆర్థిక మంత్రి ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించారని తెలిపారు. కావున తెలంగాణ శాసనసభ కార్య విధాన, కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 168 (1) నిబంధన ప్రకారం భారత రాష్ట్ర సమితి శాసనసభా పక్షం తరపున ఆర్థిక మంత్రిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తున్నామని తమ పిటిషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివరించారు.

## పురిటినొప్పులతో గ్రూప్-2 పరీక్ష

### గర్భిణికి అండగా అధికార యంత్రాంగం

**ప్రజానావ, నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పురిటి నొప్పుల తోనే ఓ అభ్యర్థి గ్రూప్-2 పరీక్ష రాశారు. బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి నాగర్ కర్నూల్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వెళ్లారు. పరీక్ష రాస్తున్న సమయంలోనే ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. అప్రమత్తమైన పరీక్ష నిర్వహణ సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అందుకు ఆమె అంగీకరించలేదు. పరీక్ష రాస్తానని చెప్పారు. ఆమె కాన్పు తేదీ ఇవాళే కావడంతో అందరూ కాస్త ఆందోళనకు గురయ్యారు. అయినా, ఆమె పట్టు వదలకుండా పరీక్ష రాస్తానని చెప్పడంతో.. అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. పరీక్ష కేంద్రంలో 108 అత్యవసర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆమెకు ఎప్పుడు తీవ్ర నొప్పులు వచ్చినా.. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అన్నీ సిద్ధంగా ఉంచారు. రేవతి భర్త, ఆమె తల్లి అందుబాటులో ఉన్నారు.



## హైదరాబాద్‌లో ఆగని డ్రగ్స్ దందా

### మీర్‌పేట్‌లో భారీగా పట్టుబడ్డ డ్రగ్స్

**ప్రజానావ, సోమాజిగూడ:** తెలంగాణ నార్కోటిక్ అధికారులు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నా.. హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా మాత్రం ఆగడంలేదు. తాజాగా మీర్‌పేట్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడడం కలకలం రేపుతోంది. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు టాస్క్‌ఫోర్స్ పోలీసులు. వారి నుంచి 53 కేజీల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రయానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు పోలీసులు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో భారీగా రక్షణ స్వాధీనం చేసుకున్నారు ఎల్బీనగర్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు. మీర్‌పేట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు నిందుతుల నుంచి కోటి 25 లక్షల రూపాయల విలువచేసే 53.5 కిలోల పప్పీస్ట్రా డ్రగ్ సీజ్ చేశారు రాచకొండ పోలీసులు.రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈజీ మనీ కోసం అలవాటు పడిన నిందితులు నార్కోటిక్ డ్రగ్స్‌ను విక్రయించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా రాజస్థాన్‌కు చెందిన మంగీలాల్, బిష్ణోయ్ మంకీలాల్ దాకా రామ్ ముగ్గురు నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన పింటూ అనే వ్యక్తి నుంచి పప్పీస్ట్రా మాదకద్రవ్యాలని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాదులో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం తెలుసుకున్న రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారుఅయితే ఈ మాదకద్రవ్యాలను లారీలు, బస్సులు, ట్రైన్ ద్వారా నగరానికి తీసుకువచ్చి కస్యూమర్లకు అమ్ముతున్నారని రాచకొండ సీపీ తెలిపారు 2023లో మంకీలాల్ బిష్ణోయ్‌ను హయత్ నగర్ పోలీసులు డ్రగ్స్ కేసులో అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. ఇతనిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని సీపీ తెలిపారు. కాగా మెయిన్ పెడ్లర్ గా ఉన్న పింటూను పట్టుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా మరో ముగ్గురు నగరంలో స్థానిక రిసీవర్సుగా ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని రాచకొండ సీపీ తెలిపారు. అయితే ఈ పప్పీస్ట్రాను పాలు వాటర్, ఛాయ్‌లో కలుపుకుని తాగుతారు. మరోవైపు, ఈ కేసు ఇంకా విచారణలో ఉందని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని రాచకొండ సిపి సుధీర్ బాబు వెల్లడించారు.




## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు

### లోక్‌సభలో ఆందోళన వ్యక్తంచేసిన ప్రియాంక
### తక్షణ చర్యలకు ప్రభుత్వానికి డిమాండ్



**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ ఘటనలపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ దేశంలో మైనారిటీలు, హిందువులపై దాడులు జరుగుతున్న ఘటనలపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడారు. ఆ దాడులపై భారత్ గళం విప్పాలని కోరారు. 'బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందూ, క్రిస్టియన్‌లపై జరుగుతున్న దాడులపై భారత ప్రభుత్వం గళం విప్పాలి. ఆ దేశంతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దేందుకు అక్కడి ప్రభుత్వాన్ని కోరాలని అన్నారు. విజయ దివస్ సందర్భంగా 1971 యుద్ధంలో అమరులైన వారికి లోక్‌సభ వేదిక గా సెల్యూట్ చేశారు. ఆనాటి తూర్పు పాకిస్థాన్ పరిస్థితిని ఇందిరా గాంధీ ధైర్యంగా చక్కదిద్దారని కొనియాడారు. ఇకపోతే ప్రియాంకా బ్యాగ్ అందరి దృష్టిని ఆకర్షించింది. దానిపై 'పాలస్తీనా' అని ఇంగ్లీష్‌లో రాసి ఉంది. ఇజ్రాయెల్ దాడులతో దుర్భర పరిస్థితులను అనుభవిస్తోన్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఆమె దానిని తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే.. బంగ్లా దేశ్ మాజీ ప్రధాని షేక్‌హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయ సాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి. దీనిపై ఇటీవల విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ.. దాడులను నివారించడానికి ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం మైనారిటీలు, హిందువుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈవిషయంపై ఇటీవల భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి నేతలతో చర్చలు జరిపారన్నారు.

# మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయండి



**ప్రజానావ, తాండూర్:** తాండూర్ మండలంలోని గ్రామపంచాయతీల్లో జనాభా ప్రాతిపాదికన మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజావాణిలో తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో మీసేవ కేంద్రాలు లేకపోవడం వలన ప్రతి చిన్న పనికి మండల కేంద్రంలోని ఐబికి ప్రజలు మీసేవ కేంద్రాలకు రావాల్సి వస్తుందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం గ్రామాల్లో మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లయితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. మండలంలో ఇదివరకు మంజూరైన మీ సేవ కేంద్రాలకు బదులుగా మరికొన్ని మీసేవ కేంద్రాలు గ్రామాల్లో ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కే సుభాష్,దుర్గం రామకృష్ణ,షేక్ మోమిన్ అలీ,కె మల్లేష్, షేక్ హైమద్,ఏ వెంకటేష్,మనిక్ రావు,శ్రీనివాస్, అంజి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ యువకుడు మృతి

**ప్రజానావ, నేరడిగొండ :** తండ్రి మందలించాడని మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని చించోలి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని చించోలి గ్రామానికి చెందిన ఆత్రం కిరణ్ కుమార్,26 గత కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసై రోజు మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. అదేక్రమంలో శనివారం కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చిన కొడుకును తండ్రి ఆత్రం కిష్టు, వ్యవసాయం పనులకు వెళ్లలేదని మందలించాడు. ఆవేశంలో చేనులోకి వెళ్లిన కిరణ్, గుర్తు తెలియని పురుగుల మందు తాగి, వాంతులు చేసుకోగా, గమనించిన తండ్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఆసుపత్రిలో మృతి చెందాడు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజానావ, నేరడిగొండ:** మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం మండలకేంద్రానికి చెందిన ఎం ప్రణీత్ అనే బాధితునికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.60 వేల చెక్కును బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అడే గజేందర్ అందజేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎల్లపుడు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆడే వసంతరావు, యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి,బోథ్ తాజా మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్,మండల యూత్ అధ్యక్షులు హిరాసింగ్ తదితరులున్నారు.

# జాలంసింగ్ కు ఘన నివాళులు



**ఉద్యమ కెరటం, నార్నూర్:** నార్నూర్ మండల కేంద్రం లో స్వర్గీయ జాలం సింగ్ 4వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమం లో పవార్ అజయ్ ఫౌండేషన్ చైర్మన్ మరియు పిఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పవార్ అజయ్ జాలం సింగ్ గారి విగ్రహానికి పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బంజారాల కోసం అయన చేసిన కృషిని కొనియాడారు.. జాలం సింగ్ గారు చూపిన మార్గంలో నడవాలని తెలిపారు.

# సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

**ప్రజానావ, నేరడిగొండ :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వ ర్యంలో సోమవారం మండంలోని వాంకిడి గ్రామ ఎస్టీకాలనీలో మండల హెల్త్ సూపర్వైజర్ సంతోష్, సిబ్బంది కలిసి సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ కోసం రక్త నమూనాలు సేకరించారు. అనంతరం రక్త హీనత నివారణకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ రక్త హీనత లోపించకుండా క్రమం తప్పకుండ పోషకాలతో కూడిన ఆహారాన్ని, తీసుకోవాలని సూచించారు, అదేవిదంగా ప్రతిఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అన్నారు. ఆయన వెంట ఎంఎల్ హెచ్పి భీమరాజ్, సిబ్బంది ఉన్నారు.



# బంజారాల అక్రమ ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలి

- వలస బంజారాలను మైదానా ప్రాంతాలకు తరలించాలి
- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్



**ప్రజానావ, ఆసిఫాబాద్:** ఆదివాసి రిజర్వేషన్ ఫలాలను అక్రమంగా వలస వచ్చి ఆదివాసి హక్కులను కొల్లగొడుతున్న లంబాడాల ఎస్టి దృవీకరణ పత్రాలు రద్దుచేసి వారిని వెంటనే మైధన ప్రాంతాలకు తరలించాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1971లో డిఎన్టీలుగా ఉండి తరువాత అక్రమంగా ఎస్టీలుగా చెలమని అవుతున్నారన్నారు. ఆదివాసుల రిజర్వేషన్ ఫలాలను తిసుకుంటూ విద్యా,వైద్యం, ఉపాధి రంగాలలో కూడా ఆదివాసులకు కాకుండా లంబాడా వాళ్లే ప్రతి శాఖలో ఉంటూ ఆదివాసులు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆదివాసుల భూములను అక్రమంగా పట్టాలు చేస్తు సాగు చేస్తున్నారు.ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడ వచ్చి దొంగ సర్టిఫికెట్లను దానికి సంబంధించిన అధికారులకు ముదుపులు ఇచ్చి అక్రమంగా ఎస్టి సర్టిఫికెట్లను పొందుతున్నారని ఆరోపించారు. వాంకిడి మండలంలో పిప్పర్ గొంది, సవతి, దాబా, ఇతర గ్రామాలలో వలసలు వచ్చి ఆదివాసులకు చాలా అన్యాయం చేస్తున్నారని , వలస లంబాడాల సర్టిఫికెట్లను రద్దుచేసి వారిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ మారుతి, జిల్లా నాయకులు కోట్నక రామ్ షావ్, కనక ప్రకాష్, కుర్సెంగ భగవాన్ పాల్గొన్నారు.

# క్రీడలు మానసికోల్లాసానిస్తాయి

## సీఎం పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్ రాజర్షి షా



**ప్రజానావ, ఆదిలాబాద్:** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ 2024 క్రీడలను జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో సిఎం కప్ 2024 క్రీడలను విజయవంతంగా పూర్తి చేసుకొని జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు.జిల్లా స్థాయి పోటీలలో గెలుపొంది రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 27 నుండి వచ్చే జనవరి 2 వ తేదీ వరకు నిర్వహించే క్రీడలలో పాల్గొని, రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలుగా నిలవాలని కోరారు . సోమవారం నుండి ఆరు రోజుల పాటు ఈ నెల 21 వరకు వివిధ రకాల క్రీడా పోటీలు జరుగుతాయని, జిల్లా స్థాయిలో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, బాడ్మింటన్ బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, చెస్, బాక్సింగ్, స్విమ్మింగ్ లతో పాటు మరికొన్ని రకాల క్రీడలు ఉంటాయని, తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టాస్ వేసి క్రీడలను ప్రారంభించి బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఒ వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ పార్థసారథి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, బండారు దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

# స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి



**ప్రజానావ, బెల్లంపల్లి:** బెల్లంపల్లి పట్టణం కన్నాల బస్తీలోని టీడీపీ కార్యాలయ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్కు టీడీపీ పట్టణ అధ్యక్షుడు, టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి టీ మణిరామ్ సింగ్ వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ కార్యాలయ స్థలాన్ని అక్రమించిన దాసరి అజయ్, సాలమ్మ పేరు మీద ఫేక్ పత్రాలు సృష్టించి కబ్జాలో ఉంచుకున్న ఎనిమిది గుంటల టిడిపి కార్యాలయ స్థలాన్ని పార్టీ వారికి అప్పగించాలని కోరారు.1993 లో బెల్లంపల్లి చీఫ్ జనరల్ మేనేజర్ మా పార్టీ కార్యాలయం కొరకు 8 గుంటల స్థలం కావాలని కోరగా అప్పుడు ఉన్నటువంటి జిఎం నారాయణ రావు,కన్నాల బస్తీలో గల నార్త్ క్రాస్ మైనుకు దగ్గరలో ఫ్యాన్ దగ్గర ఆఫీసు నిర్మాణం కొరకు వారు స్థలము కేటాయించడం జరిగింది. అట్టి స్థలంలో 1994లో నారాయణరావు చీఫ్ విప్ బోడ జనార్ధన్ ఎమ్మెల్యే వేణుగోపాల చారి భూమి పూజ చేసి కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అ స్థలంలో కార్యాలయ నిర్మాణ పనులు కూడా జరిగాయని, ఇదే క్రమంలో దాసరి అజయ్ దౌర్జన్యంగా స్థలాన్ని అక్రమించారు. స్థలాన్ని ఖాళీ చేయమంటే కులం పేరు తో మీ మీద అట్రాసిటీ కేసు పెడతానని బెదిరింపులు, గుండాయిజానికి పాలు పడుతున్నాడని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు మా తెలుగుదేశం పార్టీ కార్యాలయంతో పాటు ఖాళీ స్థలాన్ని భూ కబ్జాదారుల నుండి విముక్తి కల్పించి పార్టీ కార్యాలయం ఇవ్వవలసిందిగా కోరుతున్నాము. అలాగే బెల్లంపల్లిలో జరుగుతున్న భూకబ్జాదారులపై కొరడా దులిపించాలని అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించాలన్నారు. లేకుంటే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బెల్లంపల్లి మాజీ పట్టణ అధ్యక్షులు టి మణి రామ్ సింగ్ నియోజకవర్గ ఇంచార్జ్ గద్దెల నారాయణ, బెల్లంపల్లి పట్టణ మాజీ ఉపాధ్యక్షులు బొల్లు మల్లయ్య మసాడి గోపాల్,ఉపాధ్యక్షులు గైన తిరుపతి,ఎస్ నవీన్ కుమార్, పొంతం యాదగిరి, ఆర్ గంగాధర్ గౌడ్,ఎం శంకర్ జి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



**ప్రజానావ, నేరడిగొండ :** సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ, వాలీబాల్ క్రీడా పోటీలకు కాకతీయ యూనివర్సిటీ వరంగల్ నుండి మండలంలోని కుంటాల గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఆడే కైలాస్, కుమారుడు ఆడే రాహుల్, రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక అయినట్లు, ఆడే వసంత్ రావ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 18 నుండి 22 వరకు కేరళ రాష్ట్రంలో కేరళ యూనివర్సిటీ కేరళ ఆధ్వర్యంలో జరిగే వాలీబాల్ పోటిల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.ఈ సందర్బంగా ఆడే రాహుల్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా మండల వాసులు, కుటుంబ సభ్యులు ఆయనను అభినందించారు.



# జీపీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

## అసెంబ్లీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ప్రజానావ, ఆసిఫాబాద్ :** గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం శాసనసభలో ఆమె గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని గళం ఎత్తారు. గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులు గత ప్రభుత్వం చెల్లించాలని మంత్రి సీతక్క అనడం సమంజసం కాదని అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అధికారంలోకి ఉంటే పెండింగ్ బిల్లులు చెల్లిస్తుండే కానీ, అధికారంలో లేని బీఆర్ఎస్ ప్రభుత్వం బిల్లులు ఎలా చెల్లిస్తుందని ఘాటుగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న ఇప్పటివరకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మన ఊరు మన బడి అభివృద్ధి పనుల బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. పెండింగ్ లో ఉన్న బిల్లుల విషయంలో పలుమార్లు సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పంచాయతీరాజ్ శాఖ మంత్రి కి విన్నవించినా ఫలితం శూన్యమని అన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల గౌరవ వేతనలు కూడా పెండింగ్ లో ఉండడం దురదృష్టకరమన్నారు. పెండింగ్లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని చెప్పారు.

# ఐఎన్టీయూసీలో చేరికలు

**ప్రజానావ, తాండూర్:** బెల్లంపల్లి ఏరియాలోని వివిధ యూనియన్ల నుంచి పలువురు కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు. బెల్లంపల్లి ఏరియా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్ నాయకత్వంలో కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రకాష్ రావు సమక్షంలో బీఎంఎస్ఉపాధ్యక్షులు అంబేద్కర్, టీబీజీకేఎస్ నాయకులు రమేష్ సంఘంలో చేరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, సత్యనారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
మంగళవారం
17 డిసెంబర్ 2024


# ఇంకెక్కడి టీడీపీ!

- టీడీపీ మాజీ ఎమ్మెల్యేతో పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్ దురుసు ప్రవర్తన



**ప్రజానావ, ఖైరతాబాద్:**

పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్ టీడీపీకి చెందిన ఓ మహిళా మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూనతో దురుసుగా ప్రవర్తించాడు. తాను టీడీపీ మాజీ ఎమ్మెల్యేనని చెప్పినా వినిపించుకోకుండా హేళన చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. తన కారుపై రూ.3వేల పెనాల్టీ ఉంటే.. ఈరోజు కడతానని చెప్పినా వినిపించుకోకుండా 'ఏ దిగు.. ఇప్పుడే కట్టాలి. మీ రాజకీయ నాయకులు కట్టరు' అంటూ దురుసుగా ప్రవర్తించారని పేర్కొంది. ఒక మాజీ ఎమ్మెల్యే, మహిళ అని కూడా చూడకుండా వారు మాట్లాడిన భాష, తీరు సబబు కాదు అంటూ ఆమె మండిపడ్డారు. 'సీఎం గారు.. ఇదేనా మన ఫ్రెండ్లీ పోలీసుల తీరు' అంటూ రేవంత్ రెడ్డిని ఆమె ప్రశ్నించారు. ఇక ట్రాఫిక్ పోలీసుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండి ఆపి వారు మాట్లాడే తీరు, భాష దారుణంగా ఉంటుందంటూ మండిపడుతున్నారు.



## ఊరుకో తల్లీ.. అమ్మ పరీక్షకెళ్లింది!

రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు సోమవారం గ్రూప్-2 పరీక్షలు కొనసాగుతుండగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలోని ధార్మిక డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు ఒక మహిళ అభ్యర్థి తన రెండు నెలల పాపాతో వచ్చారు. తల్లి పరీక్ష రాయడానికి పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో నానమ్మ వద్ద ఉన్న పాప గుక్కపట్టి ఏడ్చింది. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న హెూం గార్డు షాహనాజ్ గమనించి పాపని తన చేతుల్లోకి తీసుకొని ఇలా ఆడించింది.

- ప్రజానావ, వేములవాడ





# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యమొద్దు

- రాజన్న సిరిసిల్ల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**ప్రజానావ, సిరిసిల్ల:**

ప్రజావాణికి వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ స్పష్టం చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఆయా శాఖలకు వస్తున్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఇందుఓ భాగంగా రెవెన్యూ శాఖపై 34, ఎస్డీసీ 6, డీడబ్ల్యూఓ 5, ఎంసీ సిరిసిల్ల 11, ఆర్అండ్‌బీ 2, ఎడ్యుకేషన్ 3, సెస్ 2, డీసీఎస్ఓ 2, డీఆర్డీఓ 1, ఎస్పీ కార్యాలయం 1, హెచ్అండ్ టీ 1, వేములవాడ మున్సిపల్ కార్యాలయం 1, అగ్రికల్చర్ 2, బోయినపల్లి ఎంపీడీఓ 1, తంగళ్లపల్లి ఎంపీడీఓ 1, డీఎంహెచ్ఓ 2, ఏరియా హాస్పిటల్ 1, ఎస్సీ కార్పొరేషన్ 1, గంభీరావుపేట ఎంపీడీఓ 1, మెడికల్ కాలేజీపై 1 ఫిర్యాదు అందిందని, మొత్తం 79 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకట ఉపేందర్ రెడ్డి, రాజేశ్వర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ పనులను పూర్తిచేయండి

- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వినతి



**ప్రజానావ, ఖైరతాబాద్:**

జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలిం నగర్, ఇంద్ర నగర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కోరారు. సోమవారం కమిషనర్‌తో చర్చించిన ఆయన పద్మాలయ అంబేద్కర్ నగర్, రోడ్డు నెంబర్ 9 అంబేద్కర్ నగర్, సాయిబాబా టెంపుల్ రోడ్డు, ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్ రోడ్డులో నూతన సీసీ రోడ్డులు వేయాలని, నూతన కమిటీ హాల్ నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రారంభ దశలో ఆగిన ఇతర రోడ్లను సైతం యుద్ధప్రతిపాదికన పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ త్వరలోనే పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

# బీఆర్ఎస్ నేతలకు మాజీ సర్పంచుల జేఏసీ కృతజ్ఞత

**ప్రజానావ, సిరిసిల్ల:**




మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల అంశంపై శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కోవ లక్ష్మి, కొత్త ప్రభాకర్ రెడ్డికి రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ సర్పంచుల జేఏసీ తరపున సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో నిరసనగా శాసనసభ నుంచి వాక్ అవుట్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపెల్లి వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా రాజకీయాల అతీతంగా సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, అసెంబ్లీలో ఉన్న 119 శాసనసభ్యులు ఏకగ్రీవంగా పెండింగ్ బిల్లులు విడుదల చేసే విధంగా మాట్లాడాలని వారు డిమాండ్ చేయడంపైనా కామారెడ్డి శాసనసభ్యుడికిప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సీతక్క నుంచి వచ్చినటువంటి స్పష్టత లేని మాటలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రూ. 691 కోట్లు సర్పంచులకు ఇవ్వాల్సిందేనని, అతి త్వరలో చెల్లిస్తామని అస్పష్టమైన ప్రకటన చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు ఏయే గ్రాంట్ నుంచి ఎంత రావాలి, ఎస్‌టీవోలో వేసిన చెక్కుల నుంచి ఎంత రావాలనే దానిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామని, నియోజకవర్గాల్లో శాసనసభ్యులను తిరగనియ్యమని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాల్లో సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై స్పష్టమైన తేదీని ప్రకటించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈనెల 27న అమరవీరుల స్థూపం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్య, సలహాదారుడు చాకలి రమేశ్, కార్యదర్శులు గున్నాల లక్ష్మణ్, సిరికొండ శ్రీనివాస్, ఆరె మహేందర్ చిట్నేని శ్రీనివాసరావు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

### 24న కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల

## దిశ సమావేశం

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి.శేషాద్రి

**ప్రజానావ, సిరిసిల్ల:**

ఈ నెల 24న ఉదయం 11 గంటలకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లోని ఆడిటోరియం హాల్ లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రివర్యులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చైర్మన్‌గా ఈ సమావేశం జరుగుతుందన్నారు. రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రితో పాటు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు పాల్గొంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, దానికి సంబంధించిన సమాచారంతో సంబంధిత అధికారులు విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

# జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలి

**ప్రజానావ, కరీంనగర్ :**



జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి సీఎంకప్ పోటీలను ఆమె ప్రారంభించారు. అంతకుముందు కలెక్టర్ క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో నిర్వహించిన పోటీలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్లు అద్వితీయ ప్రతిభ కనబరిచి చాంపియన్లుగా ఎదిగి జిల్లా పేరును నిలపాలన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే సీఎం కప్ క్రీడలను గ్రామ పంచాయతీ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించడం గర్వకారణమన్నారు. కరీంనగర్ డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, జూడో, బేస్‌బాల్, ఆర్చరీలో తొలి రోజు పోటీలు నిర్వహించగా రెండు వేల మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారన్నారు. తెలంగాణ ఒలింపిక్ సంఘ సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో క్రీడలకు తలమానికంగా జిల్లా నిలుస్తుందన్నారు. కలెక్టర్ రన్నింగ్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఖో-ఖో క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగిరెడ్డి సిద్దారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అ2ధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండి యూనిస్‌పాషా, సొల్లు సారయ్య, అంతటి శంకరయ్య పాల్గొన్నారు.

### మొదటి రోజు ఫలితాలు

జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో భాగంగా మొదటి రోజు మహిళలు, పురుషుల విభాగాల్లో ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, జూడో, అథ్లెటిక్స్, బేస్‌బాల్, ఆర్చరీ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు ముగిసే సమయానికి ఖో-ఖో మహిళల విభాగంలో గంగాధర మండలం ప్రథమ స్థానం, శంకరపట్నం మండలం ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ క్రీడాంశంలో పురుషుల విభాగంలో తిమ్మాపూర్ మండలం ప్రథమ స్థానం, గంగాధర మండలం ద్వితీయ స్థానాలను, మహిళల విభాగంలో కొత్తపల్లి మండలం ప్రథమస్థానం, సైదాపూర్ మండలం ద్వితీయ స్థానం సాధించాయి.

కబడ్డీలో మహిళల విభాగంలో కరీంనగర్ అర్బన్ మండలం ప్రథమ స్థానం, హుజూరాబాద్ మండలం ద్వితీయ స్థానాలను సాధించాయి. ఖో-ఖో పురుషుల విభాగంలో, కబడ్డీ పురుషుల విభాగంలో సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లను మంగళవారం నిర్వహించే పోటీలతోపాటు నిర్వహించనున్నారు.

## క్రిస్మస్ కార్నివాల్ ప్రారంభం

**ప్రజానావ, కరీంనగర్ :**

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం క్రిస్మస్ కార్నివాల్ నిర్వహించారు. జిల్లాలోని కేజీబీవీల్లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగంలో శిక్షణ పొందిన విద్యార్థినులు తయారు చేసిన క్రిస్మస్ ట్రీలు, న్యూఇయర్ గ్రీటింగ్ కార్డులు, డెకరేషన్ హౌజ్‌లు, డెకరేషన్ బంతులు, టిష్యూ పేపర్లు, శాంతక్లాజ్‌లు, ఉలెన్ బాస్కెట్లు ప్రదర్శనలో ఉంచారు. కార్నివాల్‌ను శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తయారు చేసిన వస్తువులను ఆసక్తిగా పరిశీలించారు. విద్యార్థినుల సృజనాత్మకతను ప్రశంసించారు. కార్నివాల్‌లో ఉన్న వస్తువులను కొనుగోలు చేశారు. ఐదు కేజీబీవీల విద్యార్థినులకు 1500 రూపాయలు ప్రోత్సాహక బహుమతిగా సమగ్ర శిక్షా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ అందించారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు జిల్లాల్లోని అన్ని కేజీబీవీల విద్యార్థినులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇస్తున్నామని, అందులో భాగంగా ఈ కార్నివాల్ ఏర్పాటు చేసినట్లు జెండర్ ఈ క్వాలిటీ కో ఆర్డినేటర్ కృపారాణి తెలిపారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, గంగాధర, చొప్పదండి, కరీంనగర్, తిమ్మాపూర్, చిగురుమామిడి కేజీబీవీల విద్యార్థినులు, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు పద్మ, రజిత, కవిత, స్వప్న, షబానా, సమగ్ర శిక్ష ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గ్రూప్ 2 పరీక్షలు



## జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ప్రజానావ, ఆసిఫాబాద్ :** జిల్లాలో ఈ నెల 15, 16 తేదీలలో జరిగిన గ్రూప్ 2 పరీక్షలు అధికారుల సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల సెయింట్ మేరీ పాఠశాలలో కొనసాగుతున్న గ్రూప్ 2 పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో 2 రోజుల పాటు జరిగిన గ్రూప్ 2 పరీక్షలు మొదటిరోజు ఉదయం, మధ్యాహ్నం 2 పేపర్లు, సోమవారం ఉదయం, మధ్యాహ్నం 2 పేపర్లు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, షూ లు అనుమతించడం జరగలేదని, నిబంధనల ప్రకారం పరీక్షలను సజావుగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగిందని, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ఆశ్రమ పాఠశాల బాలికల సత్తా



**ప్రజానావ, నేరడిగొండ :** జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి సీఎం కప్ 2024 క్రీడా పోటీల్లో మండలంలోని లఖంపూర్, కుంటాల గ్రామాల ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల నుండి సోమవారం జిల్లాస్థాయి బాలికల విభాగం వాలీబాల్ పోటీల్లో పాల్గొని రాణించారు. ఏఎస్పీ సురేందర్ రావ్, డివైఎస్ఒ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రథమ బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు,తోటి విద్యార్థులు వారిని అభినందించారు.

# ప్రభుత్వం తరపున క్రైస్తవులకు పూర్తి భద్రత



## • మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజానావ, సికింద్రాబాద్:** రాష్ట్రంలోని క్రైస్తవ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి భద్రత, మద్దతు ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ లో మార్థోమ చర్చిలో జరిగిన సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో క్రైస్తవులకు భద్రతా మద్దతు విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయాన్ని తెలియజేయమంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చెప్పారని ఆ మేరకు ఆయన సందేశాన్ని మీకు తెలియజేస్తున్నానని మంత్రి వివరించారు. ప్రపంచంలో క్రైస్తవులు ప్రధానంగా విద్యా వైద్యం విషయంలో నిస్వార్థ సేవలు అందిస్తున్నారని మంత్రి పొంగులేటి అన్నారు. కేవలం నామమాత్రపు రుసుముతో ఇటు విద్య అటు వైద్యాన్ని పేద ప్రజలకు చేరువ చేస్తున్నారని కొనియాడారు. అంతేకాకుండా ఇందిరమ్మ రాజ్యానికి క్రైస్తవుల మద్దతు ఎప్పుడూ లభిస్తుందని ఆయన గుర్తు చేసుకున్నారు. వైఎస్ఆర్సీపి తరపున తాను ఖమ్మం ఎంపీగా పోటీ చేసినప్పుడు క్రైస్తవులు పూర్తిగా మద్దతు పలికి సహకరించిన విషయాన్ని ఆయన మరోసారి గుర్తు చేసుకున్నారు. ఇందిరమ్మ రాజ్యం పేదల పక్షాన ఉంటుందని అటువంటి ప్రభుత్వానికి పేదలకు సేవలు చేసే క్రైస్తవులు సహకరించాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలో 4500 కిలోమీటర్ల పాదయాత్ర చేశారని రానున్న కాలంలో ఆయన మరింత మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించేలా క్రైస్తవులు ప్రార్థనలు చేయాలని మంత్రి పొంగులేటి కోరారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ చర్చిలో జరిగే కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం సత్కరించడం మర్చిపోలేని అనుభూతి అని మంత్రి తెలిపారు. ఈ క్రిస్మస్‌తో 2024కు గుడ్‌బై చెప్పి కొత్త సంవత్సరానికి ముందుగానే స్వాగతం పలుకుతూ %-% ప్రతి ఒక్కరు కొత్త సంవత్సరంలో ఒక నిర్దిష్ట పని పూర్తికి సంకల్పం తీసుకునే అవకాశం క్రిస్మస్‌తో వచ్చిందని భావించాలని అన్నారు. యేసు జన్మించిన ఈ పవిత్ర దినం.. క్రైస్తవ సోదర సోదరీమణులు ఎదురుచూసే గొప్పరోజు.. మనమంతా ఆ దేవుని పిల్లలం అని చెప్పారు ఎందుకంటే..పిల్లల పాపాలను భరిస్తూ, ఉపశమింపజేస్తూ నిలిచే నిజమైన రక్షకుడు యేసు అని మంత్రి పొంగులేటి కీర్తించారు. బైబిల్ పట్టు కొన్నవారో, చర్చికి వెళ్లి ప్రార్థనలు చేసేవారో ఆ బైబిల్‌లో ఉన్న శాంతి ప్రేమ, వాత్సల్యాల వంటి సందేశాలను అందరిపై చూపిస్తే వారి ఆరాధనకు అసలైన అర్థం లభిస్తుందని అన్నారు. శాంతికి, స్నేహానికి ప్రతిరూపంగా నిలిచే క్రిస్మస్ వేళ ప్రతి ఇల్లు, ప్రతి హృదయం ఆనందంతో నిండాలని, ఆ భగవంతుడి కరుణా కటాక్షములు మీపై కురవాలని ప్రార్థిస్తున్నాను అని మంత్రి పొంగులేటి అన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్టు



**ప్రజానావ, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లాలోని కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపీఎస్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలసి చిన్న ధర్మారం శివారు అడవి ప్రాంతంలో పేకాట రాయుళ్లు జూదమాడుతున్న తరుణంలో వారి స్థావరంపై ఆకస్మిక దాడి చేసి ఆరుగురుని పట్టుకున్నారు. వారి వద్ద నుండి 13వేల 220 రూపాయలు నగదు ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు వారు పేర్కొన్నారు. పట్టుబడ్డ వారిలో ఎగ్గె రాజ్ కుమార్(38), వేల్పుల సతీష్(38), షేక్ అహ్మద్(41), ఎండి యాఖీన్(48), మారం శంకర్(35), సూరం శ్రీనివాస్ ఉన్నారు. వీరిని కాసిపేట పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు పేర్కొన్నారు.

# శబరికి అయ్యప్ప గురుస్వాములు



**ప్రజానావ, మందమర్రి :** మందమర్రి హరిహర అయ్యప్ప స్వామి దేవాలయం లో సోమవారం షిర్కే గురు స్వామి బృందం ప్రతి సంవత్సరం లాగా ఈసారి కూడా కార్తీక మాసంలో అయ్యప్ప మాలలు ధరించి 41 రోజులు నియమ,నిష్టల కఠోర దీక్షలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములు ఇరుముడితో బయలుదేరుతున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు స్వాముల పాదాలను నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అయ్యప్ప స్వాముల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు భక్తులతో దేవాలయ ప్రాంగణం వెల్లువెత్తింది.



# కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం

**ప్రజానావ, జైనూర్ :** కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమం అని కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. సోమవారం జైనూర్, సిర్పూర్-యు, లింగాపూర్ మండలాలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ సుగుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాత్, మండల అధ్యక్షుడు షేక్ ముఖీద్ , లింగాపూర్ అధ్యక్షుడు జాధవ్ లోకెందర్ లతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ముందుగా జైనూర్ మండలంలోని దబోలి గ్రామంలో పంచాయతీ రాజ్ శాఖ నుంచి మంజూరు అయినా అంగన్వాడీ బిల్డింగ్ శంకు స్థాపన చేశారు. అనంతరం సిర్పూర్-యు మండలంలోని పిట్టగూడా గ్రామంలో అంగన్వాడీ బిల్డింగ్ కు శంకుస్థాపన చేశారు.లింగాపూర్ మండల కేంద్రంలో అంగన్వాడీ బిల్డింగ్ కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మర్లవాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎంఎ రఫీక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, లింగు, షేకు, అహేమద్ ఖాన్, సయ్యద్ వసీం ,రాంశావ్, మెస్రం జంగు, జైనూర్ , సిర్పూర్-యు, లింగాపూర్ మండలల నాయకులు , కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# సమగ్ర శిక్షా ఉద్యోగులను సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తా

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు

**ప్రజానావ, ఆసిఫాబాద్ :** సమగ్ర శిక్షా ఉద్యోగులను సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు , కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి ఆత్రం సుగుణ అన్నారు. కలెక్టరేట్ ఎదుట గత 7 రోజులుగా నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు సోమవారం వారు దీక్ష శిబిరానికి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం ఉద్యోగుల ను క్రమబద్ధీకరణ లేదా పే స్కేల్ ఇవ్వడానికి సిద్ధం గా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ,అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా కొంత ఆలస్యమైనా త్వరలో మీకు తీపి కబురు అందిస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు వీరికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మసడె చరణ్, సీనియర్ నాయకులు అసద్ , డాక్టర్ రమేష్ , రఫీక్, టీఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఇందురావ్ , సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షురాలు శృతిక, గౌరవ అధ్యక్షుడు మోహన్, ఉపద్యక్షురాలు నాగసుధ, ప్రధాన కార్యదర్శి తుకారం , సంఘం జిల్లా కోశాధికారి నాగేష్ , మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, దుర్గం సందీప్, ప్రత్యేకాధికారిని అరుణ, మీనా, సి సి ఓ సంఘం జిల్లా అధ్యక్షులు అనూప్ మహేష్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సిఆర్పి అధ్యక్షుడు పవన్, రాజేష్, పిజిసిఆర్టి లు అన్నపూర్ణ, స్వప్న, పి టి ఐ అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు రమేష్, ప్రకాష్ , తిరుపతి, శివరాం ప్రసన్న , స్వప్న , సరస్వతి, సునీల్, సతీష్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



**ప్రజానావ, నేరడి గొండ (బోథ్):** ప్రభుత్వ పాఠశాలలో నిత్యం వండి పెడుతున్న మధ్యాహ్న భోజన పెండింగ్ ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని బోథ్ మండల మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఎంఈఒకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మార్కెట్ లో గుడ్డు ధర 7.50ఉందని ప్రభుత్వం మాకు 5 రూపాయల చొప్పున ఇస్తుందని, మార్కెట్ ధరకు గుడ్డు రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నేటి నుండి వంటలు చేయడం ఆపివేయడం జరుగుతుందని హేచ్చరించారు.అదేవిదంగా పెండింగ్ బిల్లులు వెంటనే ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండి రఫీ,గంగన్న, బచ్చమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి హెడ్ క్వార్టర్స్ పర్యవేక్షణ



**ప్రజానావ, బెల్లంపల్లి :** బెల్లంపల్లి హెడ్ క్వార్టర్స్ ను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సోమవారం పర్యవేక్షించారు. ఆర్మ్డ్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పర్యవేక్షణలో భాగంగా డీసీపీ భాస్కర్ తో కలిసి ఆర్ఐ ఆఫీసును పరిశీలించారు. అనంతరం ఆర్ఐలతో మాట్లాడి సిబ్బంది డ్యూటీ ప్రోగ్రామ్స్, కానిస్టేబుళ్లకు స్పెషల్ పార్టీ విధులు, శిక్షణ సంబంధించి ట్రాక్, ఆప్టికల్ మరమ్మత్తుల వివరాలు తెలుసుకున్నారు. హెడ్ క్వార్టర్స్ ను ఎప్పుడు శుభ్రంగా ఉంచాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ రాజు, బెల్లంపల్లి ఏసీబీ రవికుమార్, శ్రీనివాస్ సంపత్ పాల్గొన్నారు.

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

మంగళవారం
17 డిసెంబర్ 2024






# ఒత్తిడిలో భారత్ జట్టు

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 51/4
- సింగిల్ డిజిట్‌కే టాప్ ఆర్డర్ పరిమితం
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు
- 6 వికెట్లతో రాణించిన బుమ్రా
- గబ్బా టెస్టుకి వరుణుడు పదే పదే అడ్డంకి




**బ్రిస్బేన్:** ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో భారత్ జట్టు ఒత్తిడిలోకి వెళ్లిపోయింది. మ్యాచ్‌లో మూడో రోజైన సోమవారం ఆట ముగిసే సమయానికి భారత్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 51/4తో నిలిచింది. క్రీజులో కేఎల్ రాహుల్ (33 బ్యాటింగ్: 64 బంతుల్లో), రోహిత్ శర్మ (0 బ్యాటింగ్: 6 బంతుల్లో) ఉన్నారు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేయగా.. భారత్ జట్టు ఇంకా 394 పరుగులు వెనకబడి ఉంది. వర్షం, వెలుతురులేమి కారణంగా ఈరోజు దాదాపు రెండు సెషన్ల ఆట తుడిచిపెట్టుకుపోయింది. మ్యాచ్‌లో మూడో రోజైన సోమవారం ఓవర్ నైట్ స్కోరు 405/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా జట్టు.. తొలి సెషన్‌లోనే 445 పరుగులకి ఆలౌటైంది. ఆ జట్టులో నిన్న అలెక్స్ క్యారీ 70 పరుగులు చేయగా.. ట్రావిస్ హెడ్, స్టీవ్‌స్మిత్ శతకాలు నమోదు చేసిన విషయం తెలిసిందే. భారత్ బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 6 వికెట్లు, మహ్మద్ సిరాజ్ రెండు, అక్షదీప్, నితీశ్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. ఆస్ట్రేలియా ఆలౌట్ తర్వాత మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ జట్టుకి ఆరంభం నుంచి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతూ వచ్చాయి. యశస్వి జైశ్వాల్ (4), శుభమన్ గిల్ (1), విరాట్ కోహ్లీ (3), రిషబ్ పంత్ (9) వరుసగా సింగిల్ డిజిట్ స్కోరుకే పెవిలియన్‌కి చేరిపోయారు. ఒకవైపు వికెట్లు కోల్పోతుండగా.. మరోవైపు వర్షం కూడా టీమిండియాను ఇబ్బంది పెట్టింది. దాంతో క్రీజులోని కేఎల్ రాహుల్ కూడా ఏకాగ్రతతో ఆడటానికి ఇబ్బందిపడుతూ కనిపించాడు. రాహుల్‌తో పాటు ప్రస్తుతం క్రీజులో కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నాడు. కానీ.. గత మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ రోహిత్ శర్మ సింగిల్ డిజిట్ స్కోరుకే ఔటైన విషయం తెలిసిందే.

### టీమిండియాకు ఫాలో ఆన్ గండం..

ఈ మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకోవాలన్నా.. ఓటమి తప్పించుకోవాలన్నా ముందుగా ఫాలో ఆన్ గండం తప్పించుకోవాలి. అందుకోసం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కనీసం 246 పరుగులు చేయాలి. ఇప్పటికే 51 పరుగులు చేయడంతో మరో 195 పరుగులు చేస్తే టీమిండియా ఫాలో ఆన్ గండం గట్టెక్కుతోంది. క్రీజులో ఉన్న రోహిత్, కేఎల్ రాహుల్‌తో పాటు తర్వాతి బ్యాటర్లు నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా కీలక ఇన్నింగ్స్ భాగస్వామ్యం నెలకొల్పితేనే ఇది సాధ్యమవుతోంది. ఎందుకంటే టెయిలెండర్లపై నమ్మకం పెట్టుకోలేం. అంతేకాకుండా నాలుగో రోజు పూర్తిగా బ్యాటింగ్ చేస్తేనే.. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి తప్పించుకోగలదు. లేకుంటే మరో ఘోర పరాజయం తప్పదు.

## బుర్రలో ఏమైనా ఉందా?

### ఆకాశ్‌పై రోహిత్ ఫైర్..




**బ్రిస్బేన్:** బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో భారత్ కష్టాల్లో పడింది. తొలుత బౌలింగ్‌లో బుమ్రా మినహా మిగతా వారు పెద్దగా రాణించలేదు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ మైదానంలో చాలా అసహనంగా కనిపించాడు. భారత్ బౌలింగ్ చేస్తున్నప్పుడు.. ఆకాశ్‌దీప్ పిచ్‌కు అవతల విసిరాడు. వెంటనే ఫీల్డ్ అంపైర్ వైడ్‌గా ఇచ్చాడు. దీంతో రోహిత్ ఒక్కసారిగా ఫైర్ అయ్యాడు. ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆసీస్ బ్యాటర్ అలెక్సీ కేరీ బ్యాటింగ్ చేస్తుండగా.. 114వ ఓవర్‌ను ఆకాశ్ వేశాడు. వికెట్లకు చాలా దూరంగా బంతిని విసిరాడు. దానిని అందుకోవడానికి వికెట్ కీపర్ రిషభ్ పంత్ చాలా శ్రమించాడు. స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న రోహిత్ వెంటనే ఆకాశ్‌ను ఉద్దేశించి.. "నీ బుర్రలో ఏమైనా ఉందా?" అని అనేశాడు. ఇవన్నీ స్టంప్ మైక్స్‌లో రికార్డయ్యాయి. ఆ వీడియోను స్టార్ స్పోర్ట్స్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. మూడో టెస్టుకు వరుణుడు తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నాడు. ఇవాళ దాదాపు ఏడెనిమిదిసార్లు అంతరాయ కలిగింది. ఆటగాళ్లు మైదానంలోకి రావడం.. చినుకులు పడటంతో మళ్లీ డగౌట్‌కు వెళ్లడమే సరిపోయింది. ఇప్పటికే భారత బౌలర్లు భారీగా పరుగులు ఇచ్చేసిన తరుణంలో.. బ్యాటర్లు బాధ్యతగా ఆడాల్సింది. కానీ, వారు దారుణమైన ప్రదర్శన చేశారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4), శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లీ (3), రిషభ్ పంత్ (9) పెవిలియన్‌కు చేరడంతో టీమ్‌ఇండియా ఇబ్బందుల్లో పడింది.




## నా బ్యాటింగ్ రికార్డు గురించి గూగుల్‌ని అడగండి : బుమ్రా

**బ్రిస్బేన్:** ఆస్ట్రేలియా, భారత్ మధ్య గబ్బా వేదికగా మూడో టెస్టు జరుగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగులకు ఆలౌటైంది. జస్‌ప్రీత్ బుమ్రా (6/76) అదరగొట్టాడు. మూడో ఆట ముగిసే సమయానికి భారత్ 51/4 స్కోరుతో కష్టాల్లో ఉంది. కేఎల్ రాహుల్ (33లి), రోహిత్ శర్మ (0లి) నాటౌట్‌గా ఉన్నారు. మూడో రోజు ఆట ముగిసిన అనంతరం బుమ్రా విలేకరులతో మాట్లాడాడు. ఈ సందర్భంగా రిపోర్టర్ అడిగిన ఓ ప్రశ్నకు బుమ్రా ఆసక్తికర రీతిలో సమాధానమిచ్చాడు. గబ్బాలో బ్యాటింగ్ పరిస్థితుల గురించి బుమ్రాకు ఓ ప్రశ్న వేయగా.. టెస్టుల్లో తన బ్యాటింగ్ రికార్డు గురించి గూగుల్‌లో వెతకాలని (నవ్వుతూ) కోరాడు. బుమ్రా ఇచ్చిన చమత్కారమైన సమాధానంతో అక్కడున్న జర్నలిస్టుల ముఖాల్లో నవ్వులు పూశాయి. టెస్టుల్లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు బుమ్రా పేరిటే ఉంది. 2022లో ఎడ్జ్‌బాస్టన్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టెస్టులో ఈ ఘనత సాధించాడు. భారత్ 377 పరుగులకు 9 వికెట్లు కోల్పోవడంతో.. బుమ్రా క్రీజ్‌లో అడుగు పెట్టాడు. ఆపై స్టువర్ట్ బ్రాడ్ వేసిన ఓవర్‌లో ఇక సింగిల్ సహా రెండు సిక్సర్లు (ఒకటి నోబాల్), 4 ఫోర్లు కొట్టాడు. మరోవైపు ఓ బంతి వైడ్‌గా వెళ్లి బౌండరీగా మారడంతో.. టెస్టు క్రికెట్‌లో ఇదే అత్యంత ఖరీదైన ఓవర్ (మొత్తంగా 35 పరుగులు)గా నిలిచింది.

## బుమ్రాకు ఇసా గుహ క్షమాపణ



**బ్రిస్బేన్:** టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు అతని అభిమాను లకు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్, కా మెంటేటర్ ఇసా గుహ క్షమాపణలు చెప్పింది. దురుద్దేశంతో తాను ఆ పదాన్ని ఉపయోగించలేదని స్పష్టం చేసింది. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవా స్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్ట్‌లో బుమ్రా ఐదు వికెట్ల ఘనతను అందుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బుమ్రాను కొనియాడుతూ.. ఇసా గుహ 'మోస్ట్ వాల్యుబుల్ ప్రిమేట్'అనే పదాన్ని ఉపయోగించింది. ప్రిమేట్ అనేది చింపాజీ క్యారెక్టర్‌తో తీసిన ఆంగ్ల హాస్య చిత్రం పేరు. దాంతో బుమ్రాను ఇసా గుహ చింపాంజీతో పోల్చిందని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. తన తప్పును తెలుసుకున్న ఇసా గుహ.. మూడో రోజు ఆట ఆరంభంలోనే బుమ్రాతో పాటు అతని అభిమానులకు క్షమాపణలు తెలియజేసింది. 'రెండో రోజు ఆటలో కామెంట్రీ చేస్తూ ఓ పదం ఉపయోగించాను. కానీ, అది విపరీత అర్థాలకు దారి తీసింది. ఆ పదం ఉపయోగించడం వల్ల ఎవరైన బాధపడితే క్షమించండి. ఇతరుల గౌరవానికి భంగం కలిగించేలా నేను ఎప్పుడూ మాట్లాడను. నా మాటలు పూర్తిగా వింటే.. బుమ్రాను కొనియాడినట్లు మీకు అర్థమవుతోంది. టీమిండియా ఆటగాళ్లను నేను ఎప్పుడూ తక్కువ చేసి మాట్లాడను. క్రికెట్ కోసం పాటుపడే వారికి కోసం అండగా ఉంటాను. బుమ్రా విషయంలోనూ అతడు సాధించిన ఘనతలను కొనియాడే క్రమంలో తప్పుడు పదం వాడాను. లైవ్ టెలికాస్ట్‌లో క్షమాపణలు చెప్పిన ఇసా గుహను టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి కొనియాడాడు. పొరపాట్లు చేయడం సహజమని, ఉత్కంఠభరితంగా సాగే మ్యాచ్‌లో కొన్నిసార్లు ఇలాంటివి జరుగుతుంటాయని, వాటిని సరిదిద్దుకొని ముందుకు సాగాలని సూచించాడు.

## విరాట్ కోహ్లీపై మండిపడుతున్న అభిమానులు, మాజీ క్రికెటర్లు




**బ్రిస్బేన్:** విరాట్ కోహ్లి తీరు మారలేదు. ఆఫ్ స్టంప్ కు దూరంగా వెళ్తున్న బంతిని వేటాడి వికెట్ పారేసుకునే తన బలహీనతను బ్రిస్బేన్ లో జరుగుతున్న మూడో టెస్టులోనూ కొనసాగించాడు. టీమ్ అప్పటికే త్వరగా రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా ఆడాల్సిన కోహ్లి.. ఇలా ఔటవడం అభిమానులు, మాజీ క్రికెటర్లను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తోంది. కోహ్లి రిటైరవ్వాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తుండటం గమనార్హం. ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియంలో జరుగుతున్న మూడో టెస్టులోనూ టీమిండి యా కష్టాల్లో పడింది. టాపార్డర్ వైఫల్యం.. కోహ్లి బాధ్యతారాహిత్యమైన షాట్ మ్యాచ్ లో ఆస్ట్రేలియా పైచేయి సాధించేలా చేసింది. దీంతో ఎక్స్ లో రిటైర్‌అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్ అవుతోంది. విరాట్ కోహ్లితోపాటు కెప్టెన్ రోహిత్ శర్మ రిటైరవ్వాలంటూ ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. మూడో రోజు లంచ్ కు ముందు హేజిల్‌వుడ్ బౌలింగ్ లో ఆఫ్ స్టంప్ కు దూరంగా వె ళ్తున్న బంతిని వేటాడబోయి విరాట్ కోహ్లి.. వికెట్ కీపర్ కేరీకి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అతడు ఇలా ఔటవడం ఇదే తొలిసారి కాదు. చాలా రోజులుగా విరాట్ బలహీనత ఇదే. దానిని అతడు అధిగమించకపోవడంతో ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోహ్లి టెస్టుల్లో నుంచి రిటైర్ కావాల్సిందే అని డిమాండ్ చేస్తున్నారు. ఈ టెస్టులో అతడు కేవలం 3 పరుగులకే ఔటయ్యాడు. విరాట్ కోహ్లి ఔటైన తీరుపై అటు మాజీ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, సంజయ్ మంజ్రేకర్ లాంటి వాళ్లు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్ స్టంప్ కు దూరంగా వెళ్తున్న బంతిని ఆడాల్సిన అవసరం ఏముందంటూ గవాస్కర్ మండిపడ్డాడు. ఈ మ్యాచ్ లో కామెంటరీ చేస్తున్న అతడు.. విరాట్ ఔటవగానే తన అసహనం వ్యక్తం చేశాడు."ఆ బంతి నాలుగో స్టంప్ పై పడి ఉంటే అర్థం చేసుకునేవాడిని. కానీ చాలా దూరంగా ఉంది. ఏడో, ఎనిమిదో స్టంప్ దగ్గర పడింది. అసలు దానిని ఆడాల్సిన అవసరం లేదు. అతడు చాలా నిరాశ చెంది ఉంటాడు. కోహ్లి కాస్త ఓపిక పట్టి ఉంటే.. రాహుల్ తో కలిసి అలాగే ఆడుతూ ఉంటేవాడు" అని గవాస్కర్ అన్నాడు. రెండో టెస్టులోనూ కోహ్లి ఇలా ఆఫ్ స్టంప్ కు దూరంగా వెళ్తున్న బంతిని ఆడి వికెట్ పారేసుకున్నాడు.

## నిప్పులు చెరిగిన స్టార్క్..





**బ్రిస్బేన్:** టీమిండియా యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌ను ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ మరోసారి బోల్తాకొట్టించాడు. గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో రెండో బంతికే పెవిలియన్‌కు చేర్చాడు. తొలి బంతి ఔట్ సైడ్ ఎడ్జ్ తీసుకుని ఫోర్త్ స్లిప్–గల్లీ నుంచి బౌండరీ వెళ్లింది. అయితే రెండో బంతిని ఫ్లిక్ షాట్‌గా బౌండరీ సాధించాలని జైస్వాల్ యత్నించాడు. అది నేరుగా షార్ట్ మిడ్ వికెట్‌లో ఉన్న మిచెల్ మార్ష్ చేతుల్లోకి వెళ్లింది. ఈ సిరీస్‌లో జైస్వాల్‌ను స్టార్క్ ఔట్ చేయడం మూడోసారి. రెండో టెస్టులో జైస్వాల్‌ను తొలి బంతికే ఔట్ చేసిన స్టార్క్ ఈ మ్యాచ్‌లో రెండో బంతికి పెవిలియన్‌కు చేర్చాడు. కాగా, జైస్వాల్ ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ల ముందు తడబడుతున్నాడు. టెస్టుల్లో తొమ్మిది ఇన్నింగ్స్‌ల్లో ఆరు సార్లు లెఫ్టార్మ్ పేసర్లకే వికెట్ సమర్పించుకున్నాడు. 158 బంతుల్లో 17.33 సగటుతో 104 పరుగులు చేసి ఆరు సార్లు వికెట్ కోల్పోయాడు.మరోవైపు మిచెల్ స్టార్క్ తన తర్వాతి ఓవర్‌లోనే మరో వికెట్ సాధించాడు. శుభ్‌మన్ గిల్‌ను బోల్తాకొట్టించాడు. స్టార్క్ వేసిన బంతిని డ్రైవ్‌కు ప్రయత్నించి గల్లీలో ఉన్న మిచెల్ మార్ష్‌కు గిల్ చిక్కాడు. దీంతో టీమిండియా ఆరు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 117.1 ఓవర్లలో 445 పరుగుల భారీ స్కోరు చేసింది. ట్రావిస్ హెడ్ (152బీ 160 బంతుల్లో, 18 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (101బీ 190 బంతుల్లో, 12 ఫోర్లు) శతకాలు సాధించారు. అలెక్స్ కేరీ (70బీ 88 బంతుల్లో, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకం బాదాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా ఆరు, మహ్మద్ సిరాజ్ రెండు, ఆకాశ్ దీప్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ తీశారు. ఓవర్‌నైట్ స్కోరు 405/7తో మూడో రోజు ఆటను ఆరంభించిన ఆసీస్ మరో 40 పరుగులే చేసి చివరి మూడు వికెట్లు కోల్పోయింది.



# ఆయుధ పూజకు స్టెప్పులేసిన రాజమౌళి


ఆస్కార్ అవార్డు విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్. కీరవాణి ఇంట్లో పెళ్లి బాజాలు మోగిన విషయం తెలిసిందే. ఆయన చిన్న కుమారుడు మత్తు వదలరా ఫేం శ్రీ సింహా తాజాగా పెళ్లి బంధంలోకి అడుగుపెట్టాడు. సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ మాగంటిని శ్రీసింహ వివాహం చేసుకున్నాడు. అయితే వీరి పెళ్లిలో రాజమౌళి దంపతులు అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి సినిమాలోని 'లంచ్ కొస్తావా మంచె కొస్తావా' పాటకు స్టెప్పులేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియో ఇప్పటికే వైరల్‌గా మారింది. అయితే పెళ్లి అనంతరం శ్రీ సింహ బారాత్ జరుగగా.. ఈ వేడుకలో రాజమౌళి మళ్లీ తన డాన్స్‌తో అలరించాడు. ఎన్టీఆర్ నటించిన దేవర సినిమాలోని ఆయుధ పూజ పాటకి కీరవాణి పెద్ద కొడుకు కాలా భైరవతో కలిసి స్టెప్పులేశాడు. కాగా ఈ వీడియోను మీరు చూసేయండి.



## సీమ బ్యాక్‌డ్రాప్‌తో నిఖిల్ కొత్త సినిమా

కెరీర్‌లో సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకరు అక్కినేని అఖిల్. గతేడాది సురేందర్ రెడ్డి దర్శకత్వంలో నటించిన ఏజెంట్ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఇప్పటివరకు నటించిన బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయకపోవడంతో.. అఖిల్ నెక్స్ట్ ఏ సినిమా ప్రకటిస్తాడా..? అని ఎదురుచూస్తున్న వారి కోసం కొత్త అప్‌డేట్ తెరపైకి వచ్చింది. అఖిల్ కొత్త ప్రాజెక్ట్ రాయలసీమ బ్యాక్ డ్రాప్‌లో సాగే ప్రేమ కథని తెలుస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ లాంచ్ కూడా పూర్తయినట్టు వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి ఎస్ థమన్ సంగీతం అందించనున్నాడు. అంతేకాదు ఈ మూవీలో డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల అఖిల్‌కు జోడీగా కనిపించబోతుందని.. హోంబ్యానర్లపై నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా తెరకెక్కించనున్నారని ఇన్ సైడ్ టాక్. మురళీ కిశోర్ అబ్బూరు వినరో భాగ్యము విష్ణు కథ చిత్రాన్ని తెరకెక్కించాడు. మరి ఈ డైరెక్టర్ అఖిల్‌కు మంచి బ్రేక్ ఇస్తాడా..? అన్నది తెలియాల్సి ఉంది. అఖిల్ నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో నవంబర్ 26న ఘనంగా జరిగింది. వీరి వెడ్డింగ్ వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది.






# కన్నప్ప ఫస్ట్‌లుక్ రిలీజ్

## లాలెట్టన్ కిరాట అనే పవర్‌ఫుల్ రోల్‌లో మోహన్‌లాల్


ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా మళయాలం స్టార్ నటుడు మోహన్ లాల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో లాలెట్టన్ (మోహన్ లాల్) కిరాట అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.




# పూనం బజ్వా గ్లామర్ షో

అందం, అభినయం దండిగా ఉన్నా కొంతమంది హీరోయిన్లు ఎందుకో చిత్ర పరిశ్రమలో స్టార్ డమ్ అందుకోలేక కొద్దికాలానికే ఫేడ్ అవుట్ అయిపోతుంటారు. మరికొందరి విషయానికి వస్తే.. వీళ్లు ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నప్పటికీ , అవకాశాలు వస్తున్నపటికీ ఎందుకో స్టార్ హీరోయిన్ కాలేకపోతున్నారు. ఈ కోవలోకే వస్తుంది పంజాబీ ముద్దుగుమ్మ పూనం బజ్వా. దాదాపు రెండు దశాబ్ధాలుగా ఇండస్ట్రీలో ఉన్నప్పటికీ ఆమెకు సరైన బ్రేక్ దక్కలేదు. పూనం కంటే వెనుక వచ్చిన ముద్దుగుమ్మలు మాత్రం స్టార్ హీరోయిన్లుగా, నేషనల్ క్రష్‌లుగా వెలుగొందుతున్నారు. కానీ ఈమెకు మాత్రం నిరాశ తప్పడం లేదు. తెలుగునాట అంతగా అవకాశాలు రాకపోవడంతో తమిళ్, కన్నడ , మలయాళ పరిశ్రమలలో గట్టిగా ఫోకస్ పెట్టారు పూనం బజ్వా. వయసు పెరుగుతుండటం, కొత్త అందాల రాకతో పూనం బజ్వాకు అవకాశాలు తగ్గిపోయాయి. 2022లో చివరిసారిగా మళయాళంలో పాథనోత్సం నూట్టండు, మే హూ మూసా.. తమిళ్‌లో గురుమూర్తి సినిమాల్లో నటించింది. తనతో పాటు కెరీర్ ప్రారంభించిన హీరోయిన్లు పెళ్లి చేసుకుని ఫ్యామిలీ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తుండగా పూనం బజ్వా మాత్రం 40కి దగ్గరవుతున్నా ఇంకా పెళ్లి ఊసే ఎత్తడం లేదు.

# బాధిత కుటుంబాన్ని కలుస్తా : అల్లుఅర్జున్



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆమె కుమారుడు శ్రీతేజ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను తాను కలవలేక పోతున్నానంటూ అల్లు అర్జున్ తాజాగా తెలిపారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. 'దురదృష్టకర సంఘటన తర్వాత వైద్య సంరక్షణలో ఉన్న శ్రీతేజ్ గురించి నేను ఆందోళన చెందుతున్నాను. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం కొనసాగుతున్న న్యాయపరమైన విచారణ కారణంగా.. ఈ సమయంలో శ్రీతేజ్‌ను, అతడి కుటుంబాన్ని కలవలేకపోతున్నాను. త్వరలోనే వారి కుటుంబాన్ని కలిసి మాట్లాడతాను. వైద్యపరంగా, కుటుంబ పరంగా వారిని ఆదుకుంటానని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాను' అని అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. కాగా, సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌ను ఈనెల 13న చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం శనివారం ఉదయం బెయిల్‌పై ఆయన్ని విడుదల చేశారు.



# అల్లుఅర్జున్ సీఎం అవుతాడు

## - జోతిష్యుడు వేణు స్వామి

తన వివాదాస్పద వ్యాఖ్యలతో ఎప్పుడు వార్తల్లో నిలిచే ప్రముఖ జోతిష్యుడు వేణు స్వామి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశాడు. జైలుకి వెళ్లిన వాళ్లందరూ సీఎం అవుతున్నారు కాబట్టి అల్లు అర్జున్ కూడా ఫ్యూచర్‌లో సీఎం అవుతాడని తెలిపాడు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గోన్న ఆయన మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డి జైలుకు వెళ్లిన వచ్చిన అనంతరం ఎలా సీఎం అయ్యాడో అలాగే అల్లు అర్జున్ కూడా ముఖ్యమంత్రి అవుతాడని.. జైలుకు వెళ్లిన అనంతరం జగన్ ఎలా కసితో బయటికి వచ్చాడో అంతకంటే 100 100 రేట్ల ఫైర్‌తో అల్లు అర్జున్ బయటికి వచ్చాడు. అతడు ఇప్పుడు పాన్ ఇండియన్ స్టార్ అయ్యాడు. భవిష్యత్‌లో ముఖ్యమంత్రి కూడా అయ్యే ఛాన్స్ ఉంది అంటూ వేణు స్వామి తెలిపాడు.

Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**